దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బిజెపి

- ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తాం
- వంద రోజుల్లో అనేక విషయాలు సాధించాం
- రాష్ట్రంలో కరువుకు గత ప్రభుత్వానిదే బాధ్యత
- 6న జన జాతర సభను విజయవంతం చేయాలి
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత దేశాన్ని బిజెపి విచ్ఛిన్నం చేస్తోందని, దేశంలో ప్రజలకు రక్షణ లేకుండా పోతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను తన దోస్తులకు అప్పజెప్పుతోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అని అన్నారు. బయటకు మాత్రం వేరుగా ఉండి, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈ నెల 6వ తేదీన నిర్వహించే కాంగ్రెస్ జన జాతర సభ ఏర్పాట్లను గురువారం స్థానిక నేతలతో కలిసి భట్టి విక్రమార్క పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతోనే రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గత వర్షాకాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వమే ఉందని, కరువుకు వాళ్లే బాధ్యత వహించాలని తెలిపారు. మూడు నెలల తర్వాత మాజీ సిఎం కెసిఆర్ బయటకు వచ్చి లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమని విమర్శించారు. విద్యుత్ వ్యవస్థను నాశనం చేసిందే గత పాలకులు అని, వాటిని బాగు చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో 'గుమ్మడి కాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకోవడం ఎందుకు' అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కెటిఆర్ ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి.. వారి హక్కులను హరించే విధంగా వ్యవహరించిందని అన్నారు. దేశ భద్రత కోసం ఉపయోగించాల్సిన వ్యవస్థను రాజకీయ స్వలాభం, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడం కోసం ఉపయోగిస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అలాంటివి ఉండబోవని స్పష్టం చేశారు. ప్రజలకు స్వేచ్ఛగా బతికే హక్కు కల్పిస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఎవరిని వదిలిపెట్టబోమని, ఎన్నికల తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో మహిళలకు లక్ష కోట్ల రూపాయాలు వడ్డీ లేని రుణాలు అందిస్తామని, ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్టు చెప్పారు. ఐదెకరాలు ఉన్న రైతులందరికీ రైతుబంధు వేశామని, ఇంకా ఐదు లక్షల మందికి మాత్రమే వేయాల్సి ఉందన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం టిఎస్‌పిఎస్‌సిని ప్రక్షాళన చేశామన్నారు. ఇప్పటికే 30వేల మందికి వివిధ ఉద్యోగాల్లో నియమాక పత్రాలు అందజేసినట్టు తెలిపారు. వంద రోజుల ప్రజాపాలనలో తమ ప్రభుత్వం అనేక విజయాలు సాధించిందన్నారు. స్వతంత్ర్యం తెచ్చిన పార్టీగా కాంగ్రెస్‌తోనే దేశ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దేశంలో ప్రజల కోసం, దేశ రక్షణ కోసం, భవిష్యత్ తరాల కోసం కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయే రీతిలో పార్లమెంట్ ఎన్నికల మెనిఫెస్టో ఉంటుందన్నారు. దేశ అభ్యున్నతి కోసం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 6న జన జాతర బహిరంగ సభ పది లక్షల మందితో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ తడాఖా చూపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కెఎల్ఆర్, నాయకులు దేపా భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లోబ్ సెంటర్ ఏర్పాట్లను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో పిఎస్ఆర్ టెక్ సెంటర్ ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆధునిక టెక్నాలజీ యుగంలో వినూత్న సాంకేతికతకు పేరొందిన చెందిన పిఎస్ఆర్ టెక్ హబ్ నగరంలో తన గ్లోబల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన దీనిని గురువారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్‌లకు మరింత మెరుగైన సేవలు అందించడం, మరింత సమర్థవంతంగా పని చేయడం తద్వారా మెరుగైన పరిష్కారాలను అందించడంలో ఈ గ్లోబల్ డెలివరీ సెంటర్ దోహదపడుతుందని పిఎస్ఆర్ టెక్ హబ్ చైర్మన్, ఎండి పుల్లూరి శ్రీరంగారావు తెలిపారు. ఇటీవల రైటిఫై సొల్యూషన్స్, ఐడెన్సిస్ టెక్నాలజీస్ అనే మరో రెండు కంపెనీలను కొనుగోలు చేయడం పిఎస్ఆర్ టెక్ హబ్‌ను మరింత పటిష్టం చేసిందని పిఎస్ఆర్ టెక్ హబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ తెలిపారు.

ప్రభుత్వం ప్రజలను, పాలనను గాలికి వదిలేసింది

- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం ప్రజలను, పాలనను గాలికి వదిలేసిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ (నందికొండ)లో కోతులు చనిపోయిన మంచినీటి వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్ కుమార్, రమావత్ రవీంద్ర కుమార్‌తో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగు,తాగు నీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వాటర్ ట్యాంక్ నీరు తాగిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. నాగార్జునసాగర్‌ను మున్సిపాలిటీగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్‌దేనని అన్నారు. 2014కు ముందు ఉన్న రోజులు పునరావృతం అవుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఎంపిపి ప్రత్యేక సలహాదారులు సుందర్ రెడ్డి, మండల అధ్యక్షులు రవి నాయక్, నందికొండ కౌన్సిలర్ జి. రమేష్, ఊర శ్రీనివాస్, సిరికొండ మధు, వీరయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐజి స్టీఫెన్ రవీంద్రపై చర్యలు తీసుకోండి

- సిఎం రేవంత్‌కు డిఎస్‌పి గంగాధర్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైబరాబాద్ మాజీ సిపి, ప్రస్తుత హోంగార్డ్స్ ఐజీ స్టీఫెన్ రవీంద్రపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కమాండ్ కంట్రోల్ డిఎస్పి గంగాధర్ ఫిర్యాదు చేశారు. తాను నార్సింగి సిఐగా ఉన్నప్పుడు భూ వివాదంలో జోక్యం చేసుకున్నానని ఆరోపిస్తూ రవీంద్ర తనను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. భూ కబ్జాదారులతో చేయి కలిపి, ఎలాంటి విచారణ చేయకుండానే తనను సస్పెండ్ చేశారన్నారు. దీనివల్ల పదోన్నతి అవకాశం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతి అవకాశం పరిశీలించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ.. న్యాయస్థానం ఉత్తర్వులను స్టీఫెన్ రవీంద్ర లెక్క చేయలేదని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. పలువురు కిందిస్థాయి అధికారులను ఆయన ఇబ్బంది పెట్టారంటూ.. ఫిర్యాదు కాపీని సిఎస్ శాంతి కుమారి, డిజిపి రవి గుప్తా, హోంశాఖ, డిఒపిటికి పంపించారు.

చెరువులు, కుంటలను సాగర్ నీటితో నింపాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని ఎడమకాలకు విడుదల చేస్తున్నారని, ఆ నీటితో నల్లగొండ జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువలు నింపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంట రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణకేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు, బావులు పూర్తిగా అడుగంటి పోయాయని, దాంతో తాగు, సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చెరువులు, కుంటలు నింపాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి రిజర్వాయర్లను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సాగు నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను ప్రభుత్వం అధికారులు పరిశీలించి ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, భవాండ్ల పాండు, వినోద్ నాయక్, తిరుపతి రామ్మూర్తి, పరుశురాములు, గోవింద్ రెడ్డి, ఉన్నం వెంకటేశ్వర్లు, పిల్లుట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 85,412 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 85,412 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేపర్-1కు 34,174 మంది, పేపర్-2కు 51,238 మంది కలిపి 85,412 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. గురువారం రోజు పేపర్-1కు 3,293 మంది, పేపర్-2కు 5,321 మంది కలిపి మొత్తం 8,614 మంది దరఖాస్తు చేశారని వివరించారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల పదో తేదీ వరకు ఉందని తెలిపారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)విధానంలో నిర్వహిస్తారు ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

శాకాహారానికి రెక్కలు

- నెలలో ఏడు శాతం పెరిగిన ధరలు
- క్రిసిల్ వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో అహారోత్పత్తుల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి. గడిచిన మార్చిలో శాఖాహార ఆహార ధరలు ఏడు శాతం పెరిగినట్లు ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్ తెలిపింది. ఫిబ్రవరి తరహా వేగంతోనే ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, టొమాటోలు అలాగే బియ్యం, పప్పుల ధరలు పెరిగాయని విశ్లేషించింది. ఈ నేపథ్యంలోనే ప్లేట్ శాకహార భోజనం ధర ఏడు శాతం పెరిగిందని పేర్కొంది. ఉత్తరం, దక్షిణం, తూర్పు, పశ్చిమ భారతదేశంలో ఉన్న ముడి సరుకుల ధరల ఆధారంగా ఇంట్లో థాలీని తయారు చేయడానికి సగటు ధర ఆధారంగా లెక్కిస్తుంది. ఇది దేశంలో ద్రవ్యోల్బణ ధోరణులను అంచనా వేయడానికి వీలు కల్పిస్తుంది. గడిచిన నెలలో ఉల్లి, టొమాటో, బంగాళదుంపల ధరలు వరుసగా ఏడాదికి 40 శాతం, 36 శాతం, 22 శాతం చొప్పున పెరిగాయని క్రిసిల్ పేర్కొంది.

రూ.కోటి పైన ఇళ్లకే డిమాండ్

- 40 శాతం అమ్మకాలు వాటివే
- ప్రధాన నగరాల్లో తీరు
- టాప్3లో హైదరాబాద్
- నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్

హైదరాబాద్ : దేశంలో నివాస అమ్మకాల్లో కొత్త ట్రెండ్ మొదలయ్యింది. రూ.కోటి పైబడిన ఇళ్లకు అనుహ్యాంగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుత ఏడాది మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో దేశంలోని బెంగళూరు, ఎన్‌సిఆర్, హైదరాబాద్, ముంబయి, పూణె, చెన్నయ్, అహ్మదాబాద్, కోల్‌కత్తా తదితర ఎనిమిది పలు ప్రధాన నగరాల్లోని అమ్మకాలు, కొనుగోళ్లను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ విశ్లేషణ చేసింది. గత మూడు నెలల్లో జరిగిన మొత్తం గృహాల అమ్మకాల్లో రూ.1 కోటి పైగా విలువ చేసినవే 40 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఇందులో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. కోటి రూపాయలకు పైగా విలువ కలిగిన ఇళ్ల అమ్మకాల్లో ఢిల్లీ అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు దేశంలో రూ.50 లక్షల్లోపు నివాస అమ్మకాలు తగ్గాయి. మరోవైపు రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ధర కలిగిన ఇళ్ల అమ్మకాలు 5 శాతం తగ్గి 28,424 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. గతేడాది 38 శాతంగా ఉన్న వీటి అమ్మకాలు 33 శాతానికి తగ్గాయి. రూ.కోటికి పైగా ధర కలిగిన ఇళ్ల అమ్మకాలు 2023 తొలి త్రైమాసికం (క్యూ1)లో 29 శాతం, క్యూ2లో 31 శాతం, క్యూ3లో 35 శాతం, క్యూ4లో 39 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయని నైట్‌ఫ్రాంక్ తెలిపింది. 2024 మార్చి త్రైమాసికంలో దేశంలోని ఆయా ప్రధాన నగరాల్లో మొత్తంగా 9 శాతం వృద్ధితో 86,345 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో 79,126 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. గడిచిన త్రైమాసికంలో రెండో సారి అత్యధిక అమ్మకాలు చోటు చేసుకున్నాయి. మొత్తం విక్రయాల్లో కోటికి పైగా ధర కలిగిన 34,895 నివాసాలు అమ్ముడయ్యాయని.. సంఖ్యాపరంగా గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 51 శాతం పెరిగాయని నైట్ ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బాలాజీ తెలిపారు. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన మార్చి త్రైమాసికంలో నివాసాలు, ఆఫీసు స్పేస్ అమ్మకాల్లో కీలక వృద్ధి చోటు చేసుకుందన్నారు. హైదరాబాద్ నివాస అమ్మకాలు 15 శాతం పెరిగి 9,550 యూనిట్లుగా నమోదయ్యాయి. 2023 ఇదే మార్చి త్రైమాసికంలో 8,300 యూనిట్ల విక్రయాలు జరిగాయి.

హక్కుల కోసం నిరంతరం పోరాటాలు : జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నేత సునీత్ చోప్రా అనీ, ఆయన పోరాట స్ఫూర్తితో బలమైన భూ పోరాటాలు- కూలిపోరాటాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరముందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జి నాగయ్య చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో సునీత్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా బిజెపి సర్కారు తొక్కి పట్టిందని విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అధ్యక్షతన సభలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, హరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పన పద్మ, మూడ్ శోభన్ పి ఆశయ్య కోట రమేష్ ఆర్ ఆంజనేయులు, రాహుల్ పాల్గొన్నారు.

బంధన్ ఎంఎఫ్ నుంచి ఇన్నోవేషన్ ఫండ్

హైదరాబాద్ : బంధన్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు బంధన్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ ఏప్రిల్ 10న ప్రారంభమై 2024 ఏప్రిల్ 24న ముగియనుందని తెలిపింది. లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్‌లు, పెట్టుబడి సలహాదారులు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ద్వారా నేరుగా ఇందులో పెట్టుబడులు పెట్టొచ్చని బంధన్ ఎఎంసి సిఇఒ విశాల్ కపూర్ తెలిపారు. ఈ నిధులను అభివృద్ధి పథంలో ఉన్న కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టనున్నామని పేర్కొన్నారు.

బ్లూస్టార్ నుంచి కొత్త డీప్ ఫ్రీజర్ల శ్రేణి

హైదరాబాద్ : ప్రముఖ ఎసి ఉత్పత్తుల కంపెనీ బ్లూస్టార్ వివిధ వర్గాల అవసరాలను తీర్చేలా విద్యుత్ ఆదా చేసే సరికొత్త డీప్ ఫ్రీజర్ల శ్రేణీని విడుదల చేసింది. 60 నుంచి 600 లీటర్ల సామర్థ్యం గల వివిధ మోడళ్లను గురువారం హైదరాబాద్‌లో బ్లూస్టార్ ఎండి బి త్యాగరాజన్ ఆవిష్కరించారు. వీటి ధరలు రూ.16వేల నుంచి ప్రారంభమవుతాయన్నారు. అహ్మదాబాద్, వాడా ప్లాంట్లలో లేటెస్ట్ ఆటోమేషన్ టెక్నలాజీతో వీటిని తయారు చేశామన్నారు. రాబోయే రోజుల్లో వాణిజ్య రిఫ్రిజరేషన్, కోల్డ్ చెయిన్ సొల్యూషన్స్ భారీగా వృద్ధి చెందనున్నాయన్నారు.

ఏనుగు దాడిలో రైతు మృతి

- నాలుగు మండలాల్లో 144 సెక్షన్ విధింపు
- గాలింపు చర్యలు చేపట్టిన అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏనుగు దాడిలో మరో రైతు మృతిచెందిన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం కొండపెల్లి గ్రామంలో గురువారం జరిగింది. చింతలమానెపెల్లి మండలంలో బుధవారం ఏనుగు దాడిలో రైతు మరణించి 24 గంటలు గడవకముందే మండలంలోని కొండపెల్లి గ్రామానికి చెందిన మరో రైతు ఏనుగు దాడిలో మృతిచెందడం కలకలం రేపుతోంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారు పోచయ్య (65) గ్రామ సమీపంలో తన పొలం వద్దకు మోటారు వేయడానికి వెళ్నారు. ఈ క్రమంలో పొలాలకు దగ్గర రోడ్డుపక్కన ఉన్న ఏనుగు ఒక్కసారిగా ఆయనపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. గామస్తులు అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖకు సమాచారం అందించగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏనుగు జాడ కోసం అటవీ శాఖ అధికారులు గాలిస్తున్నారు. ఏనుగు కాలి ముద్రల ఆధారంగా ఏ వైపునకు వెళ్లిందో తెలుసుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి కాగజ్‌నగర్ డిఎస్‌పి కరుణాకర్, అదనపు కలెక్టర్ వేణు, రేంజ్ అధికారి సుధాకర్ చేరుకొని మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి వారితో మాట్లాడారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాల్సిందిగా గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. మృతునికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో అటవీ పరిసర గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఏనుగు దాడి చేయడంతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆయా గ్రామాల్లో డప్పు చాటింపు చేయించారు. పెంచికల్‌పేట్, బెజ్జూరు ప్రధాన రహదారి గుండా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కొండపెల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ ఏనుగును చూడడం..అది ఆయన వెంట పడటంతో గ్రామంలోకి పరుగులు తీశారు. ఏనుగును పరిసరాల నుండి వెళ్లేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంఘటనా స్థలానికి కాగజ్‌నగర్ రూరల్ సిఐ రాంబాబు, ఎస్ఐ కొమురయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు వెళ్లి పరిశీలించారు.

పదేళ్లుగా రుణమాఫీ చేయని బిఆర్ఎస్ సిగ్గుపడాలి

- నిమిషం కూడా కరెంట్ పోకుండా చూస్తున్నాం
- గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం
- తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేండ్లుగా రుణమాఫీ చేయనందుకు బిఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. గత ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యం ఏలిందని, వారు చేసిన తప్పులను దిద్దుకుంటూ ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఖమ్మం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. వర్షాలు సరిగ్గా లేకపోవడం వల్ల ప్రాజెక్టుల్లో నీళ్లు లేవన్నారు. నాగార్జున సాగర్‌లో గేట్లుఎత్తినా నీళ్లు రాని పరిస్థితి నెలకొందన్నారు. మంచి నీళ్లను పక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సమస్యను పరిష్కరించేందు కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలను దేశం మొత్తం చూస్తుందన్నారు. కష్టకాలం.. కరువు కాలంలో ఉన్నామని, పరిపాలన, ప్రభుత్వం మీద ఏ రకమైన అనుమానాలకు తావు లేదన్నారు. బిఆర్ఎస్ నేతలకు రుణమాఫీ మీద మాట్లాడేందుకు సిగ్గు ఉండాలని, పదేండ్లుగా వానే రుణ మాఫీ చేయలేకపోయారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో సాగు నీరు లేక ఎక్కడా పంట ఎండిపోలేదని, రోజుకి రూ.50 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క నిమిషమూ కరెంట్ పోకుండా చూస్తున్న ప్రభుత్వం తమదని తెలిపారు. పార్లమెంట్‌లో ఓట్ల కోసం కొంత మంది విమర్శలు చేస్తున్నారని, సాగర్ నుంచి పాలేరుకు నీళ్లు తెప్పించినట్టు చెప్పారు. చేతకాని, పనికిరాని మాటలు ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, ఇప్పటికీ వారి బుద్ధి మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికలోనూ బిఆర్ఎస్, బిజెపిలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కటి, రెండు సీట్లు కూడా బిఆర్ఎస్ పార్టీకి రావని తెలిపారు. ధాన్యం అమ్ముకున్న వెంటనే డబ్బులు వచ్చేలా చేస్తున్నామని తెలిపారు. పంట నష్టం బీమా ప్రభుత్వం చెల్లిస్తుందని, రెండు లక్షల అప్పు ఈ ప్రభుత్వం తీర్చుతుందన్నారు. మంచినీటికి ఇబ్బంది ఉన్న మాట నిజమేనని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. తుక్కుగూడసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావీద్, దొబ్బల సౌజన్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో విస్తృత తనిఖీలు

- ఇప్పటి వరకు రూ.5,31,61,970 నగదు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి హైదరాబాద్ నగరంలో పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అధికారులు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. నగరవ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన అధికారులు.. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు కేంద్ర బలగాలను మోహరించారు. ఈ క్రమంలో ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున నగదు, మద్యంతోపాటు విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు హైదరాబాద్ జిల్లాలో రూ.5,31,61,970 నగదును సీజ్ చేశారు.

వరసగా మద్యం, వస్తువులు, నగదు పట్టివేత

జిల్లాలో వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు బృందాల ద్వారా గురువారం ఒక్కరోజే రూ. 27,12,390 నగదు, రూ. 8,23,500 విలువ గల ఇతర విలువైన వస్తువులతోపాటు 155.90 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశారు. నగదు, ఇతర వస్తువులపై 12 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి అధికారులు 6 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. 55 లైసెన్స్ గల ఆయుధాలు డిపాజిట్ చేశారు. ఇదిలావుండగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి నగరంలో ఇప్పటి వరకు రూ. 5,31,61,970 నగదు, ఒక రూ.1,72,46,788 విలువ గల ఇతర వస్తువులను సీజ్ చేశారు. 19,179.81 లీటర్ల మద్యం పట్టుకుని 133 కేసులు నమోదు చేసి 132 మందిని అరెస్ట్ చేశారు. 2324 లైసెన్స్ గల ఆయుధాలను డిపాజిట్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ద్వారా రూ.2,72,81,100లతోపాటు పోలీస్ శాఖ ద్వారా రూ. 2,43,01,180 లు, ఎస్ఎస్‌టి బృందాల ద్వారా రూ. 15,79,690 నగదును సీజ్ చేశారు.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD

O.S. No. 3475 of 2023

Between:
Suguru Peddabudi Lakshmi ...Plaintiff
AND
K.Sujatha and Another ...Defendants

To,
Suresh H/o. K.Sujatha Aged about : Major, Occ: Business, R/o.H.No. 8-2-293/82/E/185K, Film Nagar, Jubilee Hills, Hyderabad - 500033.

Please take notice that the above O.S.No. 3475 of 2024 filed by the Plaintiff for Eviction against the defendants. Before the Hon'ble V Junior Civil Judge, City Civil Court, Hyderabad. The same is posted on **10-04-2024** at **10:30** AM for your appearance. Be present on the above date and time, when the case will be taken up for consideration. You can appear in person or through your Advocate, failing which, the matter will be heard and decided as per the Law and Rules.

//By order of the Hon'ble Court//

Sd/-
M/s. C.P.K.V.SASTRY
DINESH JAISWAL
Advocates
Off: 14-7-208, Chudi Bazar, Begum Bazar, Hyderabad-12.
Ph: 040-65597670
Cell : 9948087688, 9390999295

పత్రికా ప్రకటన (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

In the Court of the Hon'ble Xth District Sessions Judge Cum Spl. Judge for SC and ST Court, Rajamahendravaram

O.S. No. 214/2015

Between:
Vemagiri Samuel ***...Plaintiff***
AND
1) Samatha Education, Agriculture Development Welfare Society, Rep. by its Secretary, Ganti Yesudasu, Alamuru.
2) Inuganti Srinivas
3) Inuganti Bangaru Lakshmi
4) Lakshmi Vilas Bank, Rajahmundry Rep. by its Branch Manager
(2nd to 4th Defendants are added as per I.A. 377/2016 order dated 13-09-2023)

2వ ప్రతివాది:
Inuganti Srinivas, S/o. Venkata Subbarao, aged 39 years, Business, R/o. D.No. 8-5-28, Weaker Sections Colony, Karmanghat, Saroornagar, Rangareddy District, Telangana State.

3వ ప్రతివాది:
Inuganti Bangaru Lakshmi, W/o. Srinivas, aged 26 years, House wife, R/o. D.No. 8-5-28, Weaker Sections Colony, Karmanghat, Saroornagar, Rangareddy District, Telangana State.

పై నెంబర్ గ్రంథంలో పై వాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీపై దావాను దాఖలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు దావా సమన్లు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందు పై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు దావా సమన్లు అమలు జరుపుటకు ది.వి. 22-04-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరఫున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.వి. 22-04-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** హాజరు అయ్యి మీ తరుపున ఆక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేనియెడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షము ఉత్తర్వులు చేయగలరు.

V.GOPALA RAO, Cell: 9849146692
Advocate, Ramachandravaram
DASARI SANJAY GUPTA, Advocate
రామచంద్రాపురం Rajamahendravaram
ది.04-04-2024 Cell: 9391473714

ప్రాణాలు బలితీసుకుంటున్న... లాభాపేక్ష

- సేఫ్టీ మెజర్‌మెంట్స్ పట్టని యాజమాన్యాలు
- కాలం చెల్లిన రియాక్టర్లు.. తనిఖీలు ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపాలు
- నిన్న కోలాండ్.. నేడు బిఎస్ ఆర్గానిక్స్
- నెల రోజుల్లో మూడు ఘోర ప్రమాదాలు
- కార్మికులకు రక్షణ కల్పించాలి: సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంపెనీ యజమానుల లాభాపేక్ష.. నిర్వాహకుల నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు మంటల్లో కలుస్తున్నాయి. పెట్టుబడులు రావాలి.. ఫ్యాక్టరీలు నెలకొల్పాలి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి.. అలాగే మనిషి ప్రాణాలూ కాపాడబడాలి.. కానీ..! ఉత్పత్తి పెంచడం.. లాభాలు పొందడం తప్ప యజమానులకు కార్మికులు, ఉద్యోగుల ప్రాణాల గురించి పట్టట్లేదు. కాలం చెల్లిన రియాక్టర్లను పెట్టడం, నైపుణ్యం, అనుభవంలేని కార్మికులతో పని చేయించడం, సేఫ్టీ మెజర్‌మెంట్స్ లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిన్న కోలాండ్.. నేడు బిఎస్ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుళ్లు సంభవించి దాదాపు 11 మంది మృతి చెందారు. 50 మంది పైగా కార్మికులు క్షతగాత్రులయ్యారు. నిరంతరం తనిఖీలు చేయాల్సిన ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు యజమానులిచ్చే కాసులకు కక్కుర్తిపడి ఎన్‌ఒసి ఇస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఫ్యాకరీ యజమానులు ఇష్టారాజ్యంగా మారారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా సంగారెడ్డి జిల్లా పేరుగాంచింది. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం మినీ ఇండియాను తలపిస్తుంది. పరిశ్రమలు విస్తరిస్తున్న కొద్ది ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా రెండు వేల పరిశ్రమలున్నాయి. పటాన్‌చెరు ప్రాంతంలోనే 1500 వరకు పరిశ్రమలున్నాయి. ఫార్మా, బల్క్‌డ్రగ్, కెమికల్ ఫ్యాక్టరీలే అధికంగా ఉన్నాయి. జిల్లాలో 1.25 లక్షల మంది కంపెనీ కార్మికులున్నారు. కంపెనీ ఖర్చులు తగ్గించుకుని లాభాలు పెంచుకునేందుకు.. వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలు.. నైపుణ్యంలేని, అనుభవంలేని సెమీ స్కిల్డ్ వర్కర్లను పెట్టుకుని పర్మినెంట్ నేచర్ ఆఫ్ వర్కులోనూ కాంట్రాక్టు కార్మికులతో పనిచేయిస్తున్నారు.

మొక్కుబడి తనిఖీలు.. భద్రతా వారోత్సవాలు

ఫ్యాక్టరీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. దాంతో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో మార్చి నాలుగు నుంచి పది వరకు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా భద్రతా వారోత్సవాలు జరిపారు. వారోత్సవాలు జరుగుతుండగానే హత్నూర మండలంలోని కోవెలెంట్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు చనిపోయారు. వారోత్సవాలు ముగిసిన వెంటనే ఇదే ప్రాంతంలోని బిఎస్ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టర్‌లో బాయిలర్, రియాక్టర్ పేలి ఆరుగురు మరణించారు. అంటే ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు మొక్కుబడి తనిఖీలు చేస్తూ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. అన్ని పరిశ్రమల్లో నిరంతర తనిఖీలు చేయడంతో ప్రమాదాల నివారణ కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారో పరిశీలించాలి. సేఫ్టీ మెజర్‌మెంట్స్ ఉండకపోతే కఠిన చర్యలు తీసుకోవాలి. బాయిలర్, రియాక్టర్స్ కాలం చెల్లినవి వాడకూడదు. కానీ.. అన్ని ఫ్యాక్టరీల్లో కాలం చెల్లిన రియాక్టర్లనే ఉపయోగిస్తున్నారు. రామచంద్రాపురంలో ఉన్న కర్మాగారాల తనిఖీ అధికారి కార్యాలయం ఉన్నదన్న విషయం ఎవరికీ తెల్వదు. యాజమాన్యాలిచ్చే మామూళ్లతోనే అంతా బాగున్నట్టు సర్టిపై చేయడం వల్ల జరిగే ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు పోతున్నాయి.

సేఫ్టీ మెజర్‌మెంట్స్ శూన్యం

ఏదైనా కర్మాగారంలో ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలి. అనివార్యంగా ప్రమాదం పొంచి ఉంటే వాటిని నివారించేందుకు అవసరమైన సేఫ్టీ మెజర్‌మెంట్స్ కూడా ఉండాలి. బాయిలర్స్, రియాక్టర్స్‌లో పొగలు, ఆవిరి, మంటలు రావడాన్ని గమనించిన వెంటనే నివారణా చర్యలు తీసుకోవాలి. నైపుణ్యం కలిగిన వాళ్లతో ప్రమాదాల నివారణకు పూనుకునేందుకు వీలుగా అవసరమైన సేఫ్టీ మెజర్‌మెంట్స్ ఉండాలి. ఫార్మా, బల్క్‌డ్రగ్, కెమికల్ ఫ్యాక్టరీల్లో ఇవేవీ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత కాలం నాటి బాయిలర్స్‌ను ఉపయోగించడం వల్లనే బిఎస్ ఆర్గానిక్‌లో మంటలొచ్చి రియాక్టర్‌పై పడి పేలుళ్లు సంభవించాయి.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రియాక్టర్‌లో పొగ వస్తుండటంతో చూసి డైరెక్టర్ రవిశర్మ అక్కడికి వెళ్లారు. అంతలోనే రియాక్టర్ పేలి తునకాతునకలయ్యారు. రియాక్టర్‌లో మంటలు రాగానే నీళ్లు చల్లడం వల్లే అది మరింత శక్తివంతంగా పేలినట్టు కార్మికులు చెబుతున్నారు. దీన్ని బట్టి కనీస నైపుణ్యంలేని వాళ్లు రియాక్టర్ ప్రాంతంలో పనిచేస్తున్నారన్న విషయం అర్థమవుతోంది. రియాక్టర్ల కాలం తీరగానే వాటిని తీసేసి కొత్తవి పెట్టాల్సిన యాజమాన్యాలు.. ఖర్చుల పేరిట పాత వాటితోనే నెట్టుకొస్తున్నారు. దాంతో 20 రోజుల వ్యవధిలోనే జిల్లాలో మూడు ప్రమాదాలు జరిగి 11 మంది చనిపోగా 50 మంది క్షతగాత్రులయ్యారు. కోవలెంట్‌లో రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు చనిపోయారు. పాశమైలారం లోని సిఎంహెచ్‌లో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారు. 18 మంది గాయపడ్డారు. బిఎస్ ఆర్గానికల్‌లో రియాక్టర్ పేలి ఆరుగురు మరణించారు. 30 మంది క్షతగాత్రులయ్యారు.

నైపుణ్యంలేని వలస కార్మికులతో పని

ఫార్మా, కెమికల్, బల్క్‌డ్రగ్స్ వంటి ఫ్యాక్టరీస్‌లో నైపుణ్యం కల్గిన వాళ్లే పనిచేయాలి. ఎంఎస్‌సి, బిఎస్‌సి, ఆర్గానిక్ కెమిస్ట్రీ వంటి చదువులు చదివి అనుభవమున్న వాళ్లు కాకుండా రసాయనాలు, ఫ్యాక్టరీ నిర్వహణ పట్ల కనీస అవగాహన లేని వలస కార్మికులతో పనిచేయిస్తున్నారు. సెమీ స్కిల్డ్, స్కిల్డ్ పేరిట కంపెనీలు కార్మికుల్ని తీసుకుంటున్నా సెమీ స్కిల్డ్ వాళ్లతోనే స్కిల్డ్ వర్కర్లు చేయాల్సిన పనులు చేయిస్తున్నారు. పటాన్‌చెరు, పాశమైలారం, గడ్డపోతారం, ఖాజిపల్లి, హత్నూర, సంగారెడ్డి, ఐడిఎ బొల్లారం పారిశ్రామిక ప్రాంతాల్లోని ఫ్యాక్టరీస్‌లో నైపుణ్యం, అనుభవరాహిత్యంతో కూడిన వాళ్లను కాంట్రాక్టు ఏజెన్సీల ద్వారా తీసుకుంటున్నారు. యుపి, ఎంపి, తమిళనాడు, చత్తీస్‌గడ్, జార్ఖండ్, బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ సదుపాయాలుండవు. ప్రమాదాలు జరిగి ప్రాణం పోయినా, క్షతగాత్రులైనా ఎవరూ పట్టించుకునే వారుండకపోవడంతో కంపెనీలు వాళ్లను బలిపశువుల్ని చేస్తున్నాయి.

ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం

ఫ్యాక్టరీస్ చట్టాలు అనేకమున్నాయి. కర్మాగారాల్ని తనిఖీ చేసే ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ మండలి ఇంజనీర్లు, లేబర్ కమిషనర్లు, పరిశ్రమల శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ, క్వాలిటీ కంట్రోల్ టీమ్స్‌తో పాటు వీటిని సమన్వయం చేయాల్సిన జిల్లా కలెక్టర్ సమన్వయంతో పనిచేయకపోవడంతో ఫ్యాక్టరీస్ యాజమానులది ఇష్టారాజ్యంగా మారింది. ఫ్యాక్టరీస్ యజమానులకు రాజకీయ నాయకుల అండదండలుండటంతో అధికార యంత్రాంగం కూడా అనుకూలంగా వ్యవహారిస్తుంది,

కార్మికులకు రక్షణ కల్పించాలి: సిపిఎం

ఫ్యాక్టరీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున నివారణ చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో మార్చి 14న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడ్డ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తనిఖీలు పట్టని డిప్యూటీ ఛీప్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎప్‌సెట్‌కు రికార్డు స్థాయిలో దరఖాస్తులు

- 3.21 లక్షల మంది అప్లై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు రికార్డు స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. ఇప్పటి వరకు 3,21,604 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతేడాది 3,20,766 మంది దరఖాస్తు చేయడం గమనార్హం. అంటే గతేడాది కంటే ప్రస్తుతం 838 దరఖాస్తులు అధికంగా రావడమ గమనార్హం. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల ఆరో తేదీ వరకు ఉన్నది. ఆలస్య రుసుంతో మే ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముంది. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరగడానికి వీలున్నది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,33,517 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 87,819 మంది, ఆ రెండు విభాగాలకూ 268 మంది కలిపి మొత్తం 3,21,604 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. గతేడాది ఇంజనీరింగ్ విభాగానికి 2,05,405 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,15,361 మంది కలిపి మొత్తం 3,20,766 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది ఇంజనీరింగ్ విభాగానికి 28,112 మంది అభ్యర్థులు అధికంగా దరఖాస్తు చేయడం గమనార్హం. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఆలస్య రుసుం లేకుండా తుది గడువు ఈ నెల ఆరో తేదీ వరకు ఉందని తెలిపారు. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. మే ఏడు, ఎనిమిది తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను, అదేనెల తొమ్మిది నుంచి 11 వరకు ఇంజనీరింగ్ విభాగం రాతపరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాల కోసం https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

సిపిఎస్‌ను రద్దు చేయాలి

- ఇసి అనుమతితో 3 డిఎలను ప్రకటించాలి
- టిజిఒ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాతపెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టిజిఒ) కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో టిజిఒ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ ఒక ప్రకటనలో విడుదల చేశారు. ప్రభుత్వం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్‌ఎస్)ని వెంటనే అమలు చేయాలని కోరారు. ట్రస్టులో ఉద్యోగులకు సమాన భాగస్వామ్యం ఉండాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను ఎన్నికల కమిషన్ (ఇసి) అనుమతితో విడుదల చేయాలని తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. విభజన సమయంలో ఎపికి కేటాయించిన 144 ఉద్యోగులను తెలంగాణకు తేవాలని వివరించారు. 317 జిఒపై తలెత్తిన అన్ని ఫిర్యాదులనూ త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. రెండో పిఆర్‌సి మధ్యంతర భృతి (ఐఆర్)ను ఐదు నుంచి 20 శాతానికి పెంచాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి 142 జిఒను పున:సమీక్షించాలని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో గతంలో ఉన్న జిల్లాల ప్రకారం అన్ని విభాగాల్లో అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే సాధారణ బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

వాస్తుతో బిఆర్ఎస్ దశ తిరుగుతుందా..?

- తెలంగాణ భవన్‌కు వాస్తు మార్పులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తిరోగమనంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ దృష్టి వాస్తుపై పడింది. పార్టీ అధికారం కోల్పోవడంతో పాటు నేతల వలసలూ పెరిగాయి. వాస్తుదోషం కారణంగానే పార్టీకి కష్టాలు వచ్చాయని నేతలు భావిస్తున్నారు. వాస్తు నమ్మకాలపై విశ్వాసం ఉంచే పార్టీ అధ్యక్షుడు కెసిఆర్.. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వాస్తు మార్పులు చేయాలని నిర్ణయించారు. కార్యాలయంలోకి వెళ్లే గేటు తెలంగాణ భవన్ తూర్పు అభిముఖంగా ఉండగా.. వాయువ్య దిశలో ఉన్న గేటు నుంచి రాకపోకలు సాగుతున్నాయి. అలా రావడం మంచిది కాదని, ఈశాన్యం వైపు ఉన్న గేటును ఇకనుంచి రాకపోకలకు వినియోగించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఈశాన్యం వైపు ఉన్న గేటును సిద్ధం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంపు నిర్మిస్తున్నారు. వీధి పోటును దృష్టిలో ఉంచుకొని లక్ష్మీనరసింహస్వామి చిత్రంతో కూడిన ఫ్లెక్సీని కూడా గేటుకు ఏర్పాటు చేశారు..

'ఎస్‌ఎ-2' పరీక్షలు 15కు వాయిదా

- ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పు
- పాఠశాల విద్యాశాఖ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఎస్‌ఏ-2 పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేసినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఈ నెల ఎనిమిది నుంచి కాకుండా 15 నుంచి ఎస్‌ఎ-2 పరీక్షలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్ సందర్భంగా ముస్లిం విద్యార్థులు ఉపవాసం ఉంటారని వివరించారు. ఇంకోవైపు ఉగాది, రంజాన్ పండుగల మధ్య పరీక్షలను నిర్వహిస్తే విద్యార్థులు వాటిపై సరిగ్గా దృష్టిసారించలేరని, బాగా రాయలేరని తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను మార్చేలా విద్యాశాఖ అధికారులను ఆదేశించాలని కోరారు. దీంతో ఎస్‌ఎ-2 పరీక్షల షెడ్యూల్ మారింది. ఇంకోవైపు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. అది ఈనెల 11వ తేదీ వరకు జరుగుతుంది. మరోవైపు పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన శిక్షణలూ పూర్తయిన తర్వాతే ఎస్‌ఎ-2 పరీక్షలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి గురువారం సవరించిన టైంటేబుల్‌ను విడుదల చేశారు. అన్ని తరగతుల విద్యార్థులకూ ఉదయం పూట పరీక్షలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటలకు జరుగుతాయని వివరించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి 11.45 గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్ష ఈనెల 20న ఉదయం తొమ్మిది నుంచి 11.45 గంటల వరకు, బయలాజికల్ సైన్స్ పరీక్ష అదేరోజు మధ్యాహ్నం 12.30 నుంచి 3.15 గంటల వరకు జరుగుతాయని వివరించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్ష ఈనెల 20న ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు, బయలాజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 23న ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అదేరోజు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహిస్తామని, మార్కుల రికార్డులపై వారి సంతకాలను తీసుకోవాలని సూచించారు. ఆర్జేడీలు, అన్ని జిల్లాల డిఇఒలు ఎస్‌ఎ-2 పరీక్షల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలని, మారిన షెడ్యూల్‌ను అమలు చేయాలని ఆదేశించారు.

వాణిజ్య పన్నుల శాఖ అధికారులపై ఏసిబి దాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణ పరిధిలోని ఎన్ఎస్పీ క్రాస్ రోడ్ వద్ద వాహనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వాణిజ్య పన్నులశాఖ అధికారులను ఏసిబి అధికారులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఎసిపిఒ శ్రీరామ్, వారి సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద అదనంగా ఉన్న పది వేల రూపాయల నగదు, పత్రాలను సీజ్ చేశారు. వాహనదారుల నుంచి అనధికారికంగా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించినట్టు ఏసిబి డిఎస్పి రమేష్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేతన్నలపై కక్షకట్టిన కాంగ్రెస్ సర్కారు

- వారిని ఆదుకోవాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేతన్నలపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టిందని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ రాశారు. బిఆర్ఎస్ పాలనలో పదేళ్లు పండుగలా కళకళలాడిన చేనేతరంగం.. కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాగులునెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతోపాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయని తెలిపారు. చేనేత కార్మికులు, పవర్ లూమ్ ఆసాములతోపాటు కార్మికులు రోడ్డునపడటంతో.. పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందు చూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్ లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నా .. ప్రభుత్వానికి కనీస కనికరం లేదని వాపోయారు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు.. ప్రతినిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనలతో.. ఏదో ఒక రూపంలో తమ ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ సర్కారులో ఏమాత్రం చలనం లేదని విమర్శించారు.

ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం.. వారి మనోస్థైర్యాన్ని మరింత దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ నేత కెకె మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు ప్రతి కార్మికుని గుండెను గాయపరిచాయని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరేసుకుని తనువు చాలించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ అబ్బాయి..లండన్ అమ్మాయి...

- బెల్లంపల్లిలో పెళ్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన రాజు, లండన్‌కు చెందిన డయానాని వివాహమాడారు. బెల్లంపల్లి పట్టణంలోని ఓ కల్యాణమండపంలో హిందూ సంప్రదాయం ప్రకారం గురువారం ఇద్దరూ ఒక్కటయ్యారు. రాజు గత మూడేళ్లుగా లండన్‌లో వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో డయానాతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. భారత్‌లోనే పెళ్లి చేసుకోవాలన్న ఆమె కోరిక మేరకు.. స్థానిక ఆచారం ప్రకారం పెద్దలు వివాహం జరిపించారు. వివిధ కారణాల వల్ల లండన్ నుంచి వధువు తల్లిదండ్రులు రాలేకపోవడంతో.. బెల్లంపల్లికి చెందిన ముత్తె వెంకటేశ్, లావణ్య దంపతులు కన్యాదానం చేశారు. వివాహానికి హాజరైన వారంతా నూతన దంపతులను ఆశీర్వదించారు.

మండువేసవి..నిండుకున్న నీళ్లు

- తాగునీటికి అవస్థ
- రబీ పంటలకూ కొరతే
- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారుల నియామకం
- ఉమ్మడి జిల్లాలవారీగా ఐఎఎస్‌లకు బాధ్యతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రమంతా తాగునీట ఎద్దడి రోజురోజుకు పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. రాజధాని హైదరాబాద్‌లోనూ ఇదే దుస్థితి. వర్షాభావం, అడుగుంటిన భూగర్భజలాల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాల వారీగా 10 మంది ఐఏఎస్ అధికారులను నియమించింది. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వారికి అధికారాలిచ్చింది. ప్రత్యామ్నాయ వనరులను అన్వేషించాలని ఆదేశించింది. రాష్ట్రంలో తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలనీ, జులై చివరి వరకు ఈ ప్రత్యేక అధికారులు సెలవు పెట్టకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్రంలో గత ఆరు నెలల్లో వర్షాభావ పరిస్థితులతో పాటు ప్రస్తుత ఎండల తీవ్రత కారణంగా జలాశయాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రధాన జలాశయాలు తాగు అవసరాలకు మినహా సాగుకు ఎంతమాత్రం నీటిని ఇవ్వలేని పరిస్థితి (డెడ్ స్టోరేజి)కి చేరాయి. భూగర్భ జలమట్టాలు సైతం గత పదేళ్లల్లో ఎన్నడూ లేనిస్థాయిలో పడిపోయాయి. ఈ నేపథ్యంలో నీటి వృదాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర జనాభా దాదాపు నాలుగు కోట్లు. హైదరాబాద్‌లోనే దాదాపు నగం వరకు నివసిస్తారు. వీటికితోడు ఏజెన్సీలోనూ మంచినీటి సమస్య ముందుకొచ్చింది.

ప్రత్యేక అధికారుల నియామకంతో తాగునీటి సమస్య అధికం కాకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఆమేరకు ఇప్పటికే సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదే పదే కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కొంతమేర ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా ఫలితం లేకుండాపోయింది. వర్షపాతం సాధారణం కంటే ఈమారు 14 శాతం తక్కువగా కురిసినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉత్తర తెలంగాణతోపాటు దక్షిణ తెలంగాణలోనూ నీటి ఎద్దడి తప్పడం లేదు. మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లోనూ సమస్య తలెత్తింది. వరంగల్, నల్లగొండతోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో పరిస్థితులు మరింత దిగజారాయి. ఉట్నూర్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో సమస్య విలయతాండవం చేస్తున్నది. జైనూర్, కెరామెరి, ఆసిఫాబాద్, వాంకిడి, సిర్పూర్ పట్టణం, తిర్యాని తదితర గిరిజన ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా కనిపిస్తున్నది. గత బిఆర్ఎస్ సర్కారు నిర్మించిన మిషన్ భగీరథ ప్రాజెక్టు నుంచి గిరిజన గూడెలకు నీళ్లందడం లేదనే ఫిర్యాదులు మంత్రులు, కలెక్టర్లకు వెల్లువెత్తుతున్నాయి. అక్కడక్కడా కొంతమేర వస్తున్నా, అందులో కలుషిత నీరే ఉంటున్నదని ఆవేదన వ్యక్తమవుతున్నది. ప్రత్నామ్నాయ చర్యల్లో భాగంగా ఉత్తర తెలంగాణలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతున్నది. నల్లాల్లో తగినంత ప్రెజర్ లేక, సరఫరా తీవ్ర ఆలస్యమవుతున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్రమం తప్పకుండా నీటి సరఫరా కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రబీ పంటలకూ నీరందడం లేదు. భూగర్భజలాలు సగటున 7.34 అడుగుల మేర పడిపోయాయని అధికారిక సమాచారం.

ఐఎఎస్ అధికారి	జిల్లాలు
ప్రశాంత్‌జీవన్ పాటిల్,	ఆదిలాబాద్, నిర్మల్
కృష్ణ ఆదిత్య	ఆసిఫాబాద్, మంచిర్యాల
ఆర్‌వి కర్ణన్,	ఉమ్మడి కరీంనగం
అనితా రామచంద్రన్	ఉమ్మడి నల్లగొండ.
శరత్	ఉమ్మడి నిజామాబాద్
బి. విజయేంద్ర	ఉమ్మడి రంగారెడ్డి
శృతి ఓజా,	ఉమ్మడి మహబూబ్‌నగర్
బి గోపి	ఉమ్మడి వరంగల్,
భారతి హోలికేరి, ఆర్కియాలజి డైరెక్టర్	ఉమ్మడి మెదక్
కె సురేంద్రమోహన్, ప్రభుత్వ కార్యదర్శి	ఉమ్మడి ఖమ్మం

రూ.25 లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత

- నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.25 లక్షలు నకిలీ కరెన్సీ తరలిస్తుండగా మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 25 లక్షల నకిలీ కరెన్సీతో పాటు నిస్సాన్ కంపెనీకి చెందిన కారు, నాలుగు మొబైల్ ఫోన్స్, కీప్యాడ్ మొబైల్, రూ.8,240 వేల అసలైన నగదును పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన హరుణ్, సయ్యద్ సగీర్, జాకీర్ సయ్యద్, అలీ ఆఫ్తాబ్ అక్తర్ నుంచి రూ. 25 లక్షల నకిలీ కరెన్సీతో నిస్సాన్ కారులో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు బయలు దేరారు. మార్గమధ్యలో ఎర్రకుంట వద్ద మహేశ్వరం ఎస్ఓటి పోలీసులు తనిఖీలు చేస్తుండగా నిందితుల నిస్సాన్ కారు అనుమానస్పదంగా కనిపించింది. దాంతో కారును పోలీసులు ఆపి తనిఖీ చేయగా రూ.25 లక్షల నకిలీ కరెన్సీ బయట పడింది. నిందితులు ఒకింత ఒరిజినల్ కరెన్సీ మధ్యలో మూడింతల నకిలీ కరెన్సీ పెట్టి చలామణి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మహేశ్వరం ఎస్ఓటి పోలీసులు బాలాపూర్ పోలీసులకు అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.